మూగజీవాలకు వైద్యం కరువు

- రెండేళ్లుగా నట్టల నివారణ మందులు కరువు
- పశువుల ఆస్పత్రులకు పంపిణీ కాని వైనం
- ప్రైవేట్‌లో కొని నష్టపోతున్న పోషకులు
- మండలంలో 31,896జీవాలు



కౌడిపల్లిలోని పశువుల ఆస్పత్రి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు అదనపు ఆదాయం వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ, జీవాల పెంపకం, కోళ్ల పెంపకం చేస్తుంటారు. సాగులో నష్టం వచ్చిన వీటివల్ల ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని రైతులు చేస్తుంటారు. జీవాల ఆరోగ్యం బాగుంటేనే ఆదాయం వస్తుంది.. లేకపోతే నష్టపోతారు. జీవాలకు రెండేళ్లుగా ప్రభుత్వం నట్టల నివారణ మందు, విటమిన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయకపోవడంతో పశువుల ఆస్పత్రుల్లో మందులు కరువయ్యాయి. దీంతో వాటి పోషకులు ప్రయివేటులో కొనుగోలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

మండలంలో 31,896 జీవాలు

వ్యవసాయంతో పాటు అదనపు ఆదాయం కోసం గొల్ల, కుర్మ సామాజిక వర్గంతో పాటు మిగతా వారు సైతం గొర్రెలు, మేకలను పెంచుకుంటున్నారు. పశు వైద్యాధికారుల లెక్కల ప్రకారం మండలంలో 31,896 జీవాలు ఉన్నాయి. ఇందులో 12,362 మేకలు,



గొర్రెలు, మేకలు

19,534 గొర్రెలు ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల కుర్మలకు గొర్రెలు పంపిణీ చేయడంతో చాలా కుటుంబాలు వాటిని పెంచుతున్నాయి.

రెండేళ్లుగా మందులు లేవు

ప్రభుత్వ పశువుల ఆస్పత్రుల్లో వివిధ రకాల టీకాలతో పాటు నట్టల నివారణ మందు, విటమిన్ ట్యాబ్లెట్లు ఏడాదిలో 2-3సార్లు ఇచ్చేవారు. దీంతో జీవాల శరీరంలో నట్టలు ఉంటే చనిపోయి జీవాలు ఆరోగ్యంగా బలంగా తయారు అయ్యేవి. దీంతో పోషకులకు లాభాలు వచ్చేవి. రెండేళ్లుగా ప్రభుత్వం మందు పంపిణీ చేయడం లేదు. దీంతో జీవాల పోషకులు ప్రైవేట్ మందుల షాపుల్లో వాటిని తెచ్చుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఒక్కసారి జీవాలకు మందు తాగించేందుకు రూ.2 వేల నుంచి రూ.4వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. కనీసం ఏడాదికి 2-3సార్లు మందు తాపితే ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యులు చెబుతున్నారు. అధికారులు స్పందించి నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని పశు పోషకులు కోరుతున్నారు.

బయట కొంటున్నాం



పశువుల ఆస్పత్రికి ఎప్పుడు వచ్చిన నట్టల నివారణ మందు లేదని చెపుతున్నారు. దీంతో బయట మందుల షాపులో కొనుగోలు చేస్తున్నాం. గత రెండేళ్లుగా మందు ఇవ్వడంలేదు. ఇక్కడ పశువుల ఆసుపత్రి ఉన్న మందులు మాత్రం లేవు.

–బురుజుకాడి మల్లేశం, కౌడిపల్లి

సరఫరా కాగానే ఇస్తాం



రెండేళ్లుగా పశువుల ఆస్పత్రికి నట్టల నివారణ మందు, విటమిన్ ట్యాబ్లెట్లు సరఫరా కావడం లేదు. దీంతో జీవాల పోషకులకు ఇవ్వడంలేదు. మందులేదని చెప్పిన జీవాల పెంపకందారులు వినకుండా తిడుతున్నారు. జిల్లా అధికారులకు సమస్యలు చెప్పాం. ప్రభుత్వం నుంచి సరఫరా కాగానే రైతులకు మందు పంపిణీ చేస్తాం.

– చెన్నయ్య, వెటర్నరీ అసిస్టెంట్ కౌడిపల్లి

క్లుప్తంగా

గోడ పత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావీణ్య

మునిపల్లి(అందోల్): బుదేరా మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవి గోడపత్రికను ఆవిష్కరించారు. బుధవారం గోడ పత్రికను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగిందన్నారు. తమ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులతో ఉచిత నాణ్యమైన బోధన, హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. బి.కామ్ (సీ.ఏ. జనరల్, ఆనర్స్, బీ.ఏ ట్యాకేషన్) బీ.బీ.ఏ గ్రూపుల్లో ప్రవేశాల కోరకు ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని ఎస్‌ఐ.ప్రవీణ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు మత్తు పదార్థాల రవాణా, గంజాయి సేవించడం, సైబర్‌నేరాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, రాంగ్‌రూట్లో ప్రయాణం, పరిమితికి మించి వాహనదారులను ఎక్కించుకోవడం, బ్యాంకుల ద్వారా ఫోన్లు చేస్తున్నామని నమ్మించి ఓటీపీలు చెప్పమనడం, ఏటీఎం సెంటర్ల వద్ద విత్‌డ్రా చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అప్రమత్తతతో సైబర్ మోసాలకు చెక్



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): అప్రమత్తతతో సైబర్ మోసాలను అరికట్టవచ్చని ఎస్‌ఐ శంకర్ అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిని, యువత మొబైల్‌లో కాంటాక్ట్ లేని నెంబర్లతో వీడియో కాల్ వస్తే లిఫ్ట్ చేయొద్దన్నారు. వీడియో కాల్‌తో సైబర్ నేరాగాళ్లు బ్లాక్ మెయిల్ చేస్తారని చెప్పారు. సైబర్ నేరాగాళ్ల ఉచ్చులో పడి ఎంతో మంది లక్షల రూపాయలు పొగొట్టుకున్నారని తెలిపారు.

రైతు భరోసా రాలేదు..

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతు భరోసా డబ్బులు జమ కాలేదని శివ్వంపేటకు చెందిన రైతు జంగం నగేష్ బుధవారం వాపోయాడు. తనకు ఉన్న 1-20 గుంటల భూమిలో వరిసాగు చేస్తున్నప్పటికీ వ్యవసాయ సిబ్బంది రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలువురు రైతులకు సంబంధించి భూముల పంటల వివరాలు నమోదు కాకపోవడంతో నష్టపోతున్నారు.

యువతను మోసం చేసిన ప్రభుత్వం

మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్

జహీరాబాద్ టౌన్: రాజీవ్ యువ వికాసం పథకంతో రాష్ట్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు నామ రవి కిరణ్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం మాటలను నమ్మి యువకులు రాజీవ్ యువ వికాసం పథకం కోసం 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఒక్కొక్కరు దరఖాస్తుకు రూ. 200 నుంచి రూ.800 ఖర్చు పెట్టుకున్నారన్నారు. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 30 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా లక్ష మంది లబ్ధిదారులను ప్రకటించిన ప్రభుత్వం తరువాత దరఖాస్తులను బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు.

ఇంటర్మీడియట్ ప్రారంభం

మునిపల్లి(అందోల్): తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఒకేషనల్ ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కవిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాటిపల్లి కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ (ఎంఎల్‌టీ) మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. మొత్తం 40 మంది విద్యార్థులకు 30 మంది జాయిన్ అయ్యారని తెలిపారు.

జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం జీఎంఆర్ మోడల్ జర్నలిస్ట్ కాలనీలో రూ.50 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం రెండు సంవత్సరాల క్రితం వంద మంది జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చారు. ఆయా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు రూ.60 లక్షల రూపాయల సొంత నిధులతో ఆరోగ్య బీమాను సైతం అందించామని గుర్తు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకుని వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



తడి,పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక మహిళలు, టీఎంసీ ఆర్పీలు, వార్డు అధికారులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రహమాన్ కాలనీ, అనుశమ్మ కాలనీల్లో పారిశుద్ధ్య పనులు, హైదరాబాద్ రోడ్డుపక్కన పెరిగిన పొదలను జేసీబీతో తొలగించే పనులను చేపట్టారు. వ్యాధుల సీజన్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ చైర్మన్



కలెక్టర్‌కు పూలకుండిని అందజేస్తున్న అంజయ్య

రాయికోడ్(అందోల్): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మెన్ జి.అంజయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలకుండిని అందజేసి జిల్లాకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్‌కు వివరించారు. గతంలో మెరుగైన సేవలందించి ప్రభుత్వ, ప్రజల మన్ననలు పొందిన కలెక్టర్ సంగారెడ్డి జిల్లాకు రావడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు.

భూభారతితో భూసమస్యల పరిష్కారం

నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి



కౌడిపల్లి: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కరిస్తామని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాయిలాపూర్‌లో రెవెన్యూ సదస్సుకు హాజరై దరఖాస్తులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహిస్తుందని చెప్పారు. రైతుల దరఖాస్తులను పరిశీలించి సమస్యలను తీరుస్తామన్నారు. ఇప్పటివరకు సాదా బైనామా, మిస్సింగ్ సర్వేనంబర్లు, కొత్త అసైన్‌మెంట్ పట్టాలకోసం రైతులు ఎక్కువగా దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి పరిశీలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్‌ఐ శ్రీహరి, మాజీ సర్పంచ్ శేఖులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 26 దరఖాస్తులు

రేగోడ్(మెదక్): మండలంలోని సిందోల్ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దత్తరెడ్డి మాట్లాడుతూ.. ఆయా సమస్యల పరిష్కారానికి 26 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. రికార్డులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే తిమ్మాపూర్‌లో కూడా రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు ఫెరోజ్, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు చెక్: ఆర్డీఓ రవీందర్ రెడ్డి

కంది(సంగారెడ్డి): భూముల సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు ఆర్డీఓ రవీందర్ రెడ్డి తెలిపారు. కంది మండలంలోని ఆరుట్లలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును బుధవారం ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను దరఖాస్తుల రూపంలో ఇవ్వాలన్నారు. మండలంలోని ఆయా ఉన్న 22 గ్రామపంచాయతీల నుంచి భూసమస్యలపై 336 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధి పోతుల బోగుగా మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లిష్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి తాత్కాలిక ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఎం.ఏ బీఈడీ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత పత్రాలతో ఈనెల 20, 21 తేదీల్లో పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో జయరాం

సంగారెడ్డి టౌన్: ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ జయరాం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి చట్టంపై చర్చించారు. మండలంలో అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను తీర్చాలన్నారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్: మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని హనుమాన్ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

మొక్కజొన్న విత్తనాలు అందజేత



విత్తనాలు అందజేస్తున్న సెహగల్ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కసాన్‌పల్లి గ్రామంలో మహిళా రైతులకు బుధవారం సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కజొన్న విత్తనాలు, పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం లీడర్ నీరజ్‌కుమార్ మొక్కజొన్న పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆధునిక వ్యవసాయ పరికరాల వాడకం గురించి చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధించే మెలకువలను వివరించారు. కార్యక్రమంలో సెహగల్ ప్రతినిధులు అవినాష్, శ్రవణ్, విజయ్, కృష్ణబాబుతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి



పాఠశాల విద్యార్థులతో గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అనంతారం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు నైపుణ్యాలు సాధించాలన్నారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు అవసరమైన బెల్టు బ్యాచ్ కంప్యూటర్లు షూస్ ఐడి కార్డులను అందించేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్‌కుమార్, విద్య కమిటీ చైర్మన్ స్వప్న మహేశ్, గ్రామపెద్దలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



ఆత్మీయ సమ్మేళనంలో భూపాల్ రెడ్డి

మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాజకీయ నాయకులు ప్రజాసేవతో పాటు సామాజిక సేవలో ముందుండాలని రాష్ట్ర మాజీ శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా ప్రజాసేవ చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని లక్ష్యంతో పట్టణంలో ఇంటర్మీడియట్ కళాశాలను మంజూరు చేయించి సొంత నిధులతో కాలేజీ నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఒకవైపు కూలీపని.. మరోవైపు జోలపాట



ఊయల ఊపుతున్న మహిళ

జోగిపేట,(అందోల్): జోగిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రహదారిపై కొన్ని రోజులుగా డ్రైనేజీ నిర్మాణం పనులు సాగుతున్నాయి. ఈ నిర్మాణం పనుల్లో నల్గొండకు చెందిన కూలీలు పని చేస్తున్నారు. సంవత్సరంలోపు చిన్నారి ఉన్నా ఓ మహిళ కూడా పనులు చేస్తుంది. స్టీల్ రాడ్‌లు భూమిలో పాతి చీరను ఊయల మాదిరి కట్టి అందులో చిన్నారిని పడుకోబెట్టింది. ఆ దృశ్యాన్ని రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా చూస్తున్నారు. గత మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా ఊయలలోనే ఉంచారు. ఒకవైపు భర్తతో కలిసి కూలీ పని చేసుకుంటూనే బిడ్డ ఏడ్చినప్పుడల్లా ఊయల ఊపుతూ జోకొట్టుతోంది. రెక్కాడితే కాని డొక్కాడని ఆ కూలీల కుటుంబాలు ఇలా రోడ్డు పక్కనే తమ బిడ్డల ఆలనాపాలన చూసుకుంటున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమం

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పోలీసు బుధవారం సైబర్ క్రైమ్‌పై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమం నర్సాపూర్ ట్రైనింగ్ ఎస్సై శిరీష, జగన్నాథం, ఎస్‌ఐ ఇతర పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

◆ ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థలం సేకరణ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ శివారులో యంగ్ ఇండియా ఇంటి గ్రేటేడ్ పాఠశాల సముదాయం కోసం బుధవారం అధికారులు స్థలం సేకరించారు. అంతకు ముందు అధికారులు సర్వే నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధికారులకు స్థలాన్ని అప్పగించారు. స్థలం సేకరించడంతో భూములు కోల్పోయిన గిరిజన రైతులకు ప్రత్యామ్నాయంగా భూములు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ పాటిల్, బాల్‌రెడ్డి, రాజు పటేల్, వెంకట్‌రెడ్డి, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ వెజిటేబుల్ మార్కెట్‌లో వ్యాపారస్తులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దన్నారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీ నుంచి ప్లాస్టిక్ రహిత బ్యాగులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వ్యాపారస్తులు, స్థానికులు పాల్గొన్నారు.

◆ భవనాల పరిశీలన

చేగుంట(తూప్రాన్): నూతనంగా ఏర్పాటైన నార్సింగి, మాసాయిపేట కస్తూర్బా బాలికల పాఠశాలల కోసం ప్రైవేటు భవనాలను డీఈఓ రాధాకిషన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని రెడ్డిపల్లి కాలనీలోని కాశీనాథ్ భవనాన్ని పరిశీలించారు. భవనంలోని వసతులను పరిశీలించి పాఠశాలల ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో డీఈఓ వెంట ఎంఈఓ కార్యాలయ సిబ్బంది స్థానికులు ఉన్నారు.

◆ ఇంటిని త్వరగా నిర్మించుకోండి

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కౌడిపల్లిలో పలువురు లబ్ధిదారులు ఇంటికి ముగ్గువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో 352 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షలు నాలుగు విడతలలో మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, హౌసింగ్ ఏఈ సుష్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, సొసైటీ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి పాల్గొన్నారు.

◆ మనోహరాబాద్ ఎంపీడీఓగా రవీందర్

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండల పరిషత్ నూతన ఎంపీడీఓగా రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎంపీడీఓగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి బాధ్యతలు అప్పగించారు.

◆ సమస్యల పరిష్కారానికే భూభారతి

న్యాల్‌కల్(జహీరాబాద్): భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని జహీరాబాద్ ఆర్డీఓ రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజోలా, గణేష్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగకుండా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ ప్రభు, రైతులు పాల్గొన్నారు.

◆ అనుమతిలేని స్కూళ్లపై చర్యలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కూల్‌ను మండల విద్యాధికారి నాగేశ్వర నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అనుమతులు లేని ఈ స్కూల్‌లో పిల్లలను చేర్పొద్దన్నారు. ఈ నెల 13న విద్యాశాఖ అనుమతి లేకుండా స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని తెలియడంతో వచ్చి గదిని సీజ్ చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పి, విద్యార్థులను పంపేశామని చెప్పారు.

◆ రైతు భరోసా నిధులు విడుదల

సంగారెడ్డి జోన్: మూడు రోజులుగా 24 మండలాలకు చెందిన 2,65,156 మంది రైతుల ఖాతాల్లో రూ.186.60 కోట్లు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం వల్ల జిల్లాలోని సన్న, చిన్న కారు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లాలో పంటలు సాగుచేసిన రైతులందరికీ రైతు భరోసా నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన రైతుల ఖాతాల్లో కూడా రైతు భరోసా నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఎకరాకు రూ 6 వేల చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు.

◆ ఎంఈఓకు సన్మానం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా బాధ్యతలను స్వీకరించిన మాణయ్యను బుధవారం పీఆర్టీయూ నాయకులు సన్మానించారు. విద్యాప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎంఈఓను కోరారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఈఓ మాణయ్య పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కొండాపూర్(సంగారెడ్డి): నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మండల అధికారి గణేష్ హెచ్చరించారు. మండల పరిధి మల్కాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. గణేష్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన ధరల పట్టి కను నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేయాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా దుకాణాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించినా విత్తనాలు, ఎరువులను ప్రభుత్వ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మిన ట్లు తేలినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న గణేష్